మరమ్మతులు మరిచారు

- నిద్రావస్థలో సీసీ కెమెరాలు
- అలంకారప్రాయంగా మారిన వైనం
- నిర్వహణపై పట్టింపు కరువు
- పట్టించుకోని అధికారులు



సీతంపేట బస్టాండ్‌లో ఆకాశంవైపు చూస్తున్న నిఘా నేత్రం



రాచపల్లిలో సీసీ కెమెరాల నేలచూపు

ఇల్లందకుంట: ప్రమాదాలు, దొంగతనం తదితర నేరాల ఛేదన కోసం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోక నిద్రపోతున్నాయి. పేరుకే సీసీ కెమెరాలు కానీ అవి పనిచేయవు. నేరస్తులను పట్టుకోవడంలో శాంతిభద్రతలు అదుపులో ఉండటానికి సీసీ కెమెరాల పాత్ర కీలకం. కానీ అవే నిఘా నేత్రాలు నిద్రా వస్థలో ఉంటూ అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 94 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బూజునూరు, సిరిసేడు, చిన్న కోమిటిపల్లి, టేకుర్తి గ్రామాలు మినహా మిగతా గ్రామాల్లో సీసీ కెమెరాలు రిపేర్లు రావడంతో మరమ్మతులు చేయించేవారు కరువయ్యారు.

గ్రామస్తుల సహకారంతో...

సర్పంచులు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, గ్రామస్తుల సహకారంతో 2017–18 సంవత్సరంలో ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో గతేడాది ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి రిపేర్లు, నిర్వహణ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు మిన్నకుండి పోవడంతో ప్రతి గ్రామాన ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేశాం



ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం. వీటి ఏర్పాటుతో నేరాలు అదుపులో ఉన్నాయి. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేశాం. నిర్వహణ సరిగా లేక అక్కడక్కడా రిపేర్‌కు వచ్చాయి. గ్రామాల్లో దుకాణదారులు, పెట్రోల్‌బంక్ నిర్వాహకులు, వ్యాపారస్తులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. – తోట తిరుపతి, ఎస్సై, ఇల్లందకుంట

దొంగలను పట్టించాయి



గ్రామంలో 2017లో రూ. 50వేల వ్యయంతో ప్రధాన చౌరస్తాల వద్ద నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. 2019లో రిపేరుకు రావడంతో మరమ్మతులు చేయించాం. కానీ మళ్లీ రిపేరుకు రావడంతో 2020 నుంచి కెమెరాలు పనిచేయడం లేదు. పక్క గ్రామం దుబ్యాలలో చోరీ కేసులో సీసీ కెమెరాలు దొంగలను పట్టించాయి. – కంది దిలీప్‌రెడ్డి, సర్పంచ్, వంతడ్పుల

క్లుప్తంగా

లబ్ధిదారుల ఎంపికపై సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ కనకయ్య

తిమ్మాపూర్: ప్రభుత్వం ఏటా పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా కానుకలు పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలానికి వచ్చిన కానుకల పంపిణీ విషయమై లబ్ధిదారుల ఎంపిక కోసం ముస్లిం మత పెద్దలతో తహసీల్దార్ కనకయ్య శనివారం సమావేశం నిర్వహించారు. మండలానికి వచ్చిన కానుకలు, లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ తేదీ తదితర అంశాలపై చర్చించారు.

విద్యుత్ భద్రతపై సమీక్ష

చొప్పదండి: మండలంలో విద్యుత్ భద్రతపై ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఉద్యోగి సొల్లేటి సాయిప్రసన్నకుమార్ రుక్మాపూర్‌లో విద్యుత్ షాక్‌తో మృతి చెందగా సంతాపం తెలిపారు. ఈసందర్భంగా విద్యుత్ శాఖలో మరణాలు సంభవిస్తుండగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లైన్‌మన్‌లకు గ్లౌజు, బూట్లు యాంటీషాక్ కిట్లు సరఫరా చేయాలని సూచించారు. బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగుల కుటుంబ భద్రతకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్, ట్రాన్స్‌కో ఏఈ భూమయ్య, ఓంకార్, విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

గంగాధర: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం అన్నదాతలు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగు విస్తీర్ణం పెరిగిందని, మెట్టప్రాంతం చొప్పదండి నియోజకవర్గంలో తాగునీటికి తంటాలు పడేవారని ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంతో భీడు భూములన్నీ సస్యశ్యామలమవుతున్నాయని, వలసలు తగ్గాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 70 వేల ఎకరాల్లో వరి సాగైందని, రైతులు పండించిన ధాన్యం దళారులకు అమ్మి నష్టపోవద్దని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు: భారత సాంకేతిక విజ్ఞాన సంస్థ హైదరాబాద్ నిర్వహించిన ఫ్యూచర్ ఇనోవేటర్ ఫేర్–2023 కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు ఎం. సాయి వినీల్, డి. విష్ణుచరణ్‌ను శనివారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన 132 ప్రాజెక్టుల్లో ఇరువురు విద్యార్థులు ప్రదర్శించిన ఆటోమేటిడ్ డ్రైనేజ్ క్లీనర్ ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుగా అవార్డును గెలుచుకుందన్నారు. అనంతరం విద్యార్థులను టీచర్లు అభినందించారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేయాలి

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో సరైన భోజనం అందడం లేదని ఓ విద్యార్థి రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ ఓరుగంటి ఆనంద్‌కు మెస్సెజ్ చేశాడు. దీంతో గురుకుల పాఠశాలను తనిఖీ చేయాలని కలెక్టర్‌కు లేఖ పంపామని ఆనంద్ ప్రకటనలో తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

వైండింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కంది కృష్ణారెడ్డి

విద్యానగర్(కరీంనగర్): ఎలక్ట్రికల్ వైడింగ్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కరీంనగర్ ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైండింగ్ పనిచేస్తున్నప్పుడు కరెంటు షాక్‌తో చాలా మంది కార్మికులు మృత్యువాత పడుతున్నారని, మరెంతో మంది అంగవైకల్యం పొందుతున్నారని, అలాంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రోజు పనిచేసినా సరైన ఆదాయం రావడం లేదని, సొంత ఇళ్లు లేక కిరాయి ఇళ్లలో ఉంటూ అద్దె కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించి, 55 ఏళ్లు దాటిన వర్కర్స్‌కు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈనెల 20న నిర్వహిస్తున్న అసోసియేషన్ ఎన్నికల్లో సభ్యులంతా పాల్గొని సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో కాయితోజు పవన్‌కుమార్, దొంతు రవీందర్, వై.గంగాధర్, పి.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



చొప్పదండి: ప్రదర్శనలు ఇస్తున్న ఫైర్ సిబ్బంది



మానకొండూర్‌లో....



జమ్మికుంట పట్టణంలో...

చొప్పదండి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపకశాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రమాదాల నివారణకు అందించే సేవలు, నీటి వినియోగం, ఎమర్జెన్సీ నంబర్, తదితర అంశాలను వివరించారు. స్థానిక ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానకొండూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో శనివారం ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్ల ప్రధాన కూడళ్లు, హోటళ్ల వద్ద అంటించారు. కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిపై నీటితో విన్యాసాలు ప్రదర్శించారు. ఇన్‌చార్జి లీడింగ్ ఫైర్‌మన్ బి. గోపాల్‌రెడ్డి, లీడింగ్ ఫైరింగ్‌మన్ జి. ధర్మ, డ్రైవర్లు, ఆపరేటర్లు, వినోద్, కుమార్, బి. సతీష్, నరేందర్, శివకుమార్, హోంగార్డులు, స్వామి, సంపత్ పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద తెలంగాణ విపత్తు స్పందన, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, విపత్తుల సమయంలో అప్రమత్తత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రులు, పాఠశాలలు, వాణిజ్య, వ్యాపార సంస్థలకు అగ్ని ప్రమాదాల నియంత్రణ పోస్టర్, కరపత్రాలను అందజేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫైర్‌మన్ రవీందర్, ఎండీ తబ్రీజ్, నరేందర్, శ్రీనివాస్, రాజు, సందీప్, సతీష్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి

మానకొండూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ అన్నారు. మండలంలోని ఊటూర్‌లో శనివారం పోచంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టి.శ్రీనివాస్‌రెడ్డి, జి.శ్రీనివాస్, యం. నరేష్, వి.కిషోర్,సురేష్, తిరుపతి, వీరయ్య పాల్గొన్నారు.

శాలివాహన సంఘం అధ్యక్షుడికి సన్మానం

మండలంలోని వేగురుపల్లిలో శాలివాహన కుమ్మరి సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు పోచంపల్లి శ్రీనివాస్‌ను రాపాక ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. సంఘం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈకార్యక్రమంలో రమేశ్, సంపత్‌రెడ్డి, అశోక్, మధు, విజయకాంత్, శ్యాం పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రాపాక ప్రవీణ్



మాట్లాడుతున్న నాయకులు

నీటి సమస్యను విన్నవించిన రైతులు



ఎమ్మెల్యేకు సమస్య విన్నవిస్తున్న రైతులు

చొప్పదండి: చొప్పదండితో పాటు చాకుంట, వెదురుగట్టు, తదితర గ్రామాల రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు ఎస్సారెస్పీ నుంచి డీ87, డీ88 ఉప కాలువలకు సాగునీరు విడుదల చేయించనున్నామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. ఈమేరకు పట్టణానికి చెందిన రైతులు శనివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిసి నీటి సమస్య విన్నవించారు. వెంటనే ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడారు. ఒక తడి నీరు వరి పంటకు అందించాలని సూచించారు. రెండు ఉపకాలువలకు నీటి విడుదల జరుగుతోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణం

పట్టణ శివారులోని కుడి చెరువు కట్ట నుంచి ఎస్సారెస్పీ ప్రధాన కాలువ వరకు రూ. 5 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్డు మరమ్మతు చేయాలని స్థానిక రైతులు ఇచ్చిన వినతి మేరకు నిధులు మంజూరయ్యాయని రైతులకు తెలిపారు. గుమ్లాపూర్, చొప్పదండిల మధ్య పాత రోడ్డును అభివృద్ధి చేసి రైతులకు ఉపయోగకరంగా మారుస్తామని చెప్పారు. రైతు సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుర్రం నందిరెడ్డి, కళ్లెం మురళి క్రిష్ణారెడ్డి, కాట్నపల్లి రాజేశ్వర్‌రెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి, దాడి అనిల్, గుర్రం మల్లారెడ్డి, కాట్నపల్లి రాఘవరెడ్డి, మారు వెంకట్ రెడ్డి, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌టీడీసీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, తదితరులు

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌టీడీసీ) చైర్మన్‌గా గెల్లు శ్రీనివాస్‌యాదవ్ హైదరాబాద్‌లోని జలవిహార్ ప్రాంగణంలో పదవీబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ టి. రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్, ఎంపీపీ దొడ్డె మమత ప్రసాద్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమ నాయకుడు గెల్లు శ్రీనివాస్‌కు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



చెక్కులు అందిస్తున్న తుమ్మనపల్లి శ్రీనివాసరావు, తదితరులు

తిమ్మాపూర్: మండలంలోని పోలంపల్లి తిమ్మాపూర్ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న మండపల్లి మల్లేష్, బుర్ర రమ కుటుంబాలను శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. పదివేల చొప్పున చెక్కులను అందజేశారు. పిల్లల చదువుకు తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలంపల్లి ఎంపీటీసీ బండారి రమేశ్, గ్రామస్తులు, శీనన్న యువసేన సభ్యులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు..

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన దాసరి మల్లమ్మ ఇటీవల మృతి చెందగా కొత్త జయపాల్‌రెడ్డి మిత్ర మండలి తరుపున శనివారం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. ఐదువేల ఆర్థికసాయం అందించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు తదితరులుపాల్గొన్నారు.

బియ్యం అందజేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాజాపల్లి గ్రామానికి చెందిన శనిగరపు శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ పరామర్శించారు. ఈసందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ పబ్బు శ్రీనివాస్ తల్లిదండ్రులు కొమురయ్య భూలక్ష్మి జ్ఞాపకార్థం, తెలంగాణ బోర్‌వెల్స్ అధినేత మహమ్మద్ రంజాన్, వజ్ర కృష్ణమూర్తి, మనోహర్ సహకారంతో మృతుడి కుటుంబ సభ్యులకు క్వింటాల్ బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మదిరే రవీందర్, అంబాల రాజు, బహుజన సమాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ మిడిదొడ్డి స్వప్న తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి, ఇతరులు

జమ్మికుంట: మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో వరంగల్ జిల్లా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా వరంగల్ అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... శిబిరం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యవసాయ, మౌలిక వసతుల కల్పన, పరిసరాల పరిశుభ్రత తదితర సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ విద్యాధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కమలాకర్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు, జమ్మికుంట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు నరేందర్, మహేష్, ప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్స్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇందిరాదేవి

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంగ్ల విభాగాధిపతి డా.పాలకుర్తి దినకర్ పర్యవేక్షణలో ఇంగ్లిష్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కోర్సు ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.ఇందిరాదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అన్ని పోటీ పరీక్షలకు ఇంగ్లిష్ చాలా ఉపయుక్తంగా ఉండటం కారణంగా సర్టిఫికెట్ కోర్స్ విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. సర్టిఫికెట్ కోర్స్ 30 గంటలలో పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.లక్ష్మినరసింహమూర్తి, కళాశాల పూర్వ ప్రధానాచార్యులు గొడిశాల పరమేశ్, అకడమిక్ కోఆర్డినేటర్ డా.జి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీధి విక్రయ జోన్లను త్వరితగతిన పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్‌సిటీ: వీధి విక్రయ జోన్‌లను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అధికారుల ఆదేశించారు. శనివారం కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ, ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి వద్ద నిర్మిస్తున్న వీధి విక్రయ జోన్లను సందర్శించి పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టొప్పో, మెప్మా పీడీ రవీందర్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, ఈఈ, డీపీపీ, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ నిర్మాణానికి విరాళం

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ముదిరాజ్ కులసంఘం సభ్యులు నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయానికి ఎంపీపీ కేతిరెడ్డి వనిత రూ.20 వేలు విరాళం ప్రకటించగా మన్నెంపల్లి ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ శనివారం కులసంఘం అధ్యక్షుడు, సభ్యులకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీకి ముదిరాజ్ కులస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బినపెల్లి మొండయ్య, శంకరయ్య, రాజమొగిలి, శ్రీనివాస్, బాలయ్య, సాయిలు, గంగాధర్, రాములు, జంపయ్య, జగన్, సమ్మయ్య, సంపత్, సాగర్, శేఖర్, రాజేశం, తిరుపతి, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్ కులసంఘం సభ్యులకు నగదు అందిస్తున్న అనిల్‌గౌడ్

'బలగం' సుధాకర్‌రెడ్డికి సన్మానం



హుజూరాబాద్: పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో బలగం సినిమాలో కొమురయ్యగా నటించిన కేతిరి సుధాకర్‌రెడ్డిని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల 1984 ఏడో తరగతి విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రూ. 70 వేల నగదు, మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మంచికట్ల భాస్కర్, సందసాని నరేశ్, కేతిరి ప్రదీప్‌రెడ్డి, కొమురవెళ్లి చెన్నస్వామి, మంచికట్ల సంపత్, పొన్నోజు మనోహర్, పెద్దిప్యాట దామోదర్, మద్దూరి నిరంజన్, ముల్కనూరు రవీందర్ తదితరులు ఉన్నారు.